మరో ప్రజా సంకల్పం

Maro Praja Sankalpam • Main Edition

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

■ బాధిత కుటుంబానికి వడ్డీ రఘురామ్ నాయుడు ఆర్థిక సాయం



తాడేపల్లిగూడెం: పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం రూరల్ మండలం వెంకటరమణగూడెం గ్రామానికి చెందిన బొట్టా ముకేంద్ర రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ ఘటన గురించి తెలుసుకున్న తాడేపల్లిగూడెం నియోజకవర్గ వైయస్ఆర్సీపీ ఇన్‌చార్జి వడ్డీ రఘురామ్ నాయుడు బాధిత కుటుంబాన్ని పరామర్శించి, కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. బాధిత కుటుంబానికి అండగా నిలుస్తూ రూ.50 వేల ఆర్థిక సాయం అందించారు. ఈ కష్ట సమయంలో కుటుంబానికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని భరోసా ఇచ్చారు. ముకేంద్ర ఆత్మకు శాంతి చేకూరాలని, ఆయన కుటుంబ సభ్యులకు ఈ తీరని దుఃఖాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో వైయస్ఆర్సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



రైతుల ఆవేదనను పట్టించుకోని కూటమి ప్రభుత్వం

■ డాక్టర్ అశోక్‌కుమార్ చింతలపూడి ఆగ్రహం

అద్దంకి: రైతులు సుభిక్షంగా ఉంటేనే దేశం సుభిక్షంగా ఉంటుందని, కానీ కూటమి ప్రభుత్వ పాలనలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ కన్నీరు పెడుతున్నారని అద్దంకి నియోజకవర్గ వైయస్ఆర్సీపీ సమన్వయకర్త డాక్టర్ అశోక్‌కుమార్ చింతలపూడి విమర్శించారు. సంతమాగులూరు మండలం కొమ్మాలపాడు గ్రామంలో విద్యుత్ సరఫరా సక్రమంగా లేక పంటలు ఎండిపోతుండటంతో రైతులు విద్యుత్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ ధర్నాకు దిగిన ఘటనపై ఆయన స్పందించారు. పంటలు ఎండిపోతున్నాయని, తమ పంటలను కాపాడాలని రైతులు వేడుకుంటున్నా ప్రభుత్వం, విద్యుత్ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. గంట, అరగంట మాత్రమే విద్యుత్ సరఫరా చేస్తున్న పరిస్థితుల్లోనూ తీవ్రమైన వోల్టేజీ సమస్యలు ఎదురవుతున్నాయని, అధికారుల నిర్లక్ష్యంతో రైతులు నష్టపోతున్నారని విమర్శించారు. ప్రభుత్వం స్పందించి రైతులకు సకాలంలో నాణ్యమైన విద్యుత్ అందించాలని డిమాండ్ చేశారు. పంటలు ఎండిపోకుండా తగిన చర్యలు తీసుకుని రైతులను ఆదుకోవాలని వైయస్ఆర్సీపీ తరఫున కోరారు.

Main Edition
14 Oct 2026 Page No. 3